క్లుప్తంగా

నేడు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

తొగుట(దుబ్బాక): మండలంలోని గుడికందుల గ్రామంలోని రైతు వేదికలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏఓ మోహన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం ఉ. 9.30 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు పాల్గొని పంటల సాగు పైన రైతులకు సూచనలు, సలహాలు అందజేస్తారని తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వ్యవసాయ కమిషన్ మెంబర్‌కు సన్మానం



భవానిరెడ్డిని సన్మానిస్తున్న రాజు

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్ర వ్యవసాయ కమిషన్ మెంబర్ భవానిరెడ్డిని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె రాజు బుధవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిసి సన్మానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, కమిషన్ మెంబర్‌గా గ్రామాల్లో పర్యటించి రైతులకు మనోధైర్యం కల్పించాలని కోరినట్లు తెలిపారు. ఆమె సానుకూలంగా స్పందించిందన్నారు.

'పశువుల' ప్రాంగణం



ఎక్సర్‌సైజ్ పోల్స్‌కు కట్టేసిన పశువులు

వర్గల్(గజ్వేల్): గ్రామీణ యువతను క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఏర్పాటైన క్రీడా ప్రాంగణాలు మొక్కుబడిగా మారాయి. సరైన ప్రదేశంలో ఏర్పాటు చేయకుండా, ఎక్కడో ఒకచోట క్రీడాపరికరాలు, బోర్డులు పెట్టేసి చేతులు దులుపుకొన్నారు. దీంతో క్రీడా ప్రాంగణాలు నిరాదరణకు గురవుతున్నాయి. పరికరాలు దుర్వినియోగమవుతున్నాయి. వర్గల్ మండలం గుంటిపల్లి క్రీడాప్రాంగణంలో ఎక్సర్‌సైజ్ పోల్స్‌కు పశువులను కట్టేస్తున్నారు. పశువుల ప్రాంగణంగా మార్చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న కుమార్

కొండపాక(గజ్వేల్): సీఎంఆర్ఎఫ్ పేదలకు అండగా ఉంటుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్ పేర్కొన్నారు. మండలంలోని దుద్దెడలో ఎండీ జానీకి రూ.21వేలు, ప్రవల్లికకు రూ.18 వేలు, చిలుముల కనకయ్యకు రూ.12వేలు, లావణ్యకు రూ.8000 మంజూర్యయి. బుధవారం నూనె కుమార్ లబ్దిదారులకు అందజేశారు. చెక్కులు మంజూరయ్యేలా కృషి చేసిన మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

నిబంధనలు తప్పనిసరి

ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్



అవగాహన కల్పిస్తున్న సుమన్‌కుమార్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులు చిన్నప్పటి నుంచే ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని వ్యాసమహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలా సాంస్కర్ కార్యక్రమానికి బుధవారం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణలో వాడే స్పీడ్ లేజర్ గన్, బ్రీత్ అనలైజర్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ గోపాల్‌రెడ్డి, ఏఎస్ఐ ఉమేష్, వ్యాసమహర్షి యోగా సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పుస్తె మట్టెలు అందజేత

సిద్దిపేటకమాన్: పేద యువతికి పుస్తె మట్టెలు అందజేసి కౌన్సిలర్ మానవత్వం చాటుకున్నాడు. మల్లారం గ్రామానికి చెందిన యువతి వివాహం ఉందనే విషయం స్థానిక 32వ వార్డు కౌన్సిలర్ రాజుశ్రీలత ద్వారా తెలుసుకున్న సిద్దిపేట 38వ వార్డు కౌన్సిలర్ ధర్మవరం బ్రహ్మం యువతికి పుస్తె మట్టెలు, గాజులు అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ దంపతులకు వారు ధన్యవాదాలు తెలిపారు.

మహిమాన్వితుడు కాశీవిశ్వనాథుడు

- నేటి నుంచి 3 రోజులు ఉత్సవాలు
- శివపార్వతుల కల్యాణం, బండ్ల బోనాల ఊరేగింపు
- ఉత్సవాలకు సర్వం సిద్ధం



కాశీవిశ్వనాథ స్వామి ఆలయం



కాశీవిశ్వనాథ స్వామి మూలవిగ్రహం

దుబ్బాక: కోరిన భక్తులకు తీర్చే మహిమ గల దేవుడిగా దుబ్బాక పట్టణంలో కొలువైన కాశీవిశ్వనాథ స్వామి ప్రసిద్ధి. పట్టణంలోని లచ్చపేట మార్గంలో ఉన్న కాశీవిశ్వనాథ స్వామి ఆలయం ఎంతో పురాతనమైనది. ఈ ప్రాంతంతో వర్షాలు సంవృద్ధిగా కురిసి పాడిపంటలతో ప్రజలంతా సుఖంగా ఉండాలన్న నమ్మకంతో కాశీవిశ్వనాథ స్వామి ఆలయాన్ని నిర్మించారు. ఆలయం నిర్మించినప్పటి నుంచి పాడి, పంటలతో ఈ ప్రాంతం కళకళలాడుతుండటం ప్రజలు సుఖసంతోషాలతో ఉంటుండటంతో ప్రతి ఏటా ఉత్సవాలను నిర్వహిస్తుంటారు. ప్రత్యేకంగా బండ్ల బోనాలు తిరగడం, స్వామి వారి రథోత్సవం పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించడం ఆనవాయితీగా వస్తుంది.

నేటి నుంచి ఉత్సవాలు

ప్రతి సంవత్సరం వైశాఖ ఏకాదశి పురస్కరించుకొని దుబ్బాక పట్టణంలో కాశీవిశ్వనాథ స్వామి ఆలయం ఉత్సవాలను నిర్వాహకులు ఘనంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం సుప్రభాతం, విఘ్నేశ్వర పూజలు, నవగ్రహారాధనలు, రుద్రాభిషేకం, రుద్రయాగం, ఉ.11.45 నిమిషాలకు శివపార్వతుల కల్యానం , సా.5 గంటలకు బండ్ల బోనాలు, వీరభద్రుని ఎదుర్కోళ్లు, వీరభద్రుని ప్రాస్థాయం, రాత్రి 10 గంటలకు వినోద కార్యక్రమాలు, ఒల్లుబండ ప్రదక్షణలు, భద్రకాళి పూజలు నిర్వహిస్తారు. శుక్రవారం కాశీవిశ్వనాథ స్వామి రథోత్సవం పట్టణంలోని ప్రధానవీధుల గుండా ఊరేగించనున్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు.కాశీవిశ్వనాథ స్వామి ఆలయం వద్ద కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను చేశారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ రఘునందన్‌రావుతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి



పట్టణంలోని కాశీవిశ్వనాథ స్వామి ఆలయం అభివృద్ధికి కృషి చేయాలి. ఆలయం ఎంతో పురాతనమైనది కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. ఈ ఆలయాన్ని పునర్మించాల్సిన అవసరం ఉంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలి.

– పాతూరి అంజిరెడ్డి, దుబ్బాక

కార్మికుల హక్కుల సాధనే ధ్యేయం

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు



విజయోత్సవ సభలో పాల్గొన్న చుక్క రాములు తదితరులు

గజ్వేల్‌రూరల్: కార్మికుల సంక్షేమం, వారి హక్కుల సాధనే ధ్యేయంగా సీఐటీయూ ముందుకు సాగుతోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు పేర్కొన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ శివారులోని రాణే పరిశ్రమలో బుధవారం కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు నిర్వహించారు. పరిశ్రమలో మొత్తం 155 ఓట్లు ఉండగా, సీఐటీయూ అభ్యర్థి మల్లిఖార్జున్‌కు 94 ఓట్లు, బీఎంఎస్ అభ్యర్థి మల్లేశంకు 60 ఓట్లు వచ్చాయి. 34 ఓట్ల ఆధిక్యంతో సీఐటీయూ అభ్యర్థి మల్లిఖార్జున్ గెలుపొందాడు. ఈ సందర్భంగా చుక్కరాములు మాట్లాడుతూ.. కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు నిర్విరామంగా కృషి చేస్తామన్నారు. వేతన ఒప్పందంతో పాటు కార్మికులకు సంక్షేమానికి కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో వరుసగా 4వ సారి సీఐటీయూ విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రాణే పరిశ్రమ నుంచి గజ్వేల్‌లోని అంబేడ్కర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లయ్య, గోపాలస్వామి, యూనియన్ నాయకులు వేణుగోపాల్, బండ్ల స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

దేశం కోసం ప్రజలంతా ఏకం కావాలి

సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇమామ్



సమావేశంలో మాట్లాడుతున్న ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పహల్గాంలో విచక్షణ రహితంగా పర్యాటకులపై కాల్పులు జరిపిన ఉగ్రవాదులకు సరైన గుణపాఠం చెప్పే సమయం వచ్చింది. అందుకు దేశ ప్రజలంతా ఏకం కావాలని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ..పూర్తి స్థాయిలో ఉగ్రవాదులను అంతం చేసే వరకు ఆపరేషన్ సింధూర్ కొనసాగించాలన్నారు. జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాం ప్రదేశానికి వెళ్లిన టూ రిస్టులను అతిదారుణంగా కాల్చి చంపిన ఉగ్రవాదులను భారత సైనికులు మట్టుబెట్టాలన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు బుద్ధి వచ్చేలా తీవ్రవాద సంస్థలను, ఉగ్రవాదులను ఏరి పారేయాలన్నారు. మన దేశం వైపు చూడాలంటేనే వణుకు పుట్టాలన్నారు. భారత్ సైనికులకు దేవుడు అండగా నిలవాలని దేశ ప్రజలంతా పూజలు, ప్రార్థనలు చేయాలన్నారు. రాగద్వేషాలు పక్కనపెట్టి కులాలు మతాలు రాజకీయాలకు అతీతంగా ఇలాంటి సమయంలో దేశం వైపు మనమంతా నిలబడాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి మధు, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గయా జుద్దీన్, నవాజ్, మహేష్, ఫయాజుద్దీన్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతతో అధిక దిగుబడులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మధుసూదన్

గజ్వేల్‌రూరల్: రైతులు సాంకేతికతను అందిపుచ్చుకొని అధిక దిగుబడులు సాధించాలని అడిషనల్ డీఆర్‌డీఓ మధుసూదన్ పేర్కొన్నారు. పట్టణంలోని రైతువేదికలో బుధవారం గ్రీన్‌హౌస్ ద్వారా కూరగాయల సాగుపై అవగాహన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. చిన్న, సన్నకారు మహిళా రైతులను లక్షాధికారులను చేయాలనే సంకల్పంతో సెర్ప్, హార్టికల్చర్, కేతి సంస్థల సమన్వయంతో 50 శాతం సబ్సిడీపై గ్రీన్ హౌస్ – షేడ్ నెట్స్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. వీటి ద్వారా సాగుచేయడం వల్ల అధిక వేడి, వర్షాలు, పురుగులు, తెగుళ్ల నుంచి పంటను రక్షించుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కేతి సంస్థ సభ్యులు విఠల్, గజ్వేల్, ఏపీఎంలు దుర్గాప్రసాద్, అలీ పాల్గొన్నారు.

ఘనంగా వాసవీమాత జయంతి



గజ్వేల్‌రూరల్: అభిషేకం చేస్తున్న సభ్యులు

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని సీతారామ ఉమామహేశ్వర దేవాలయంలోని కొలువుదీరిన వాసవీ మాత జయంతి వేడుకలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి సామూహిక పారాయణం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. పసుపు కొమ్ములతో అమ్మవారికి అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

లచ్చపేటలో..

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటలో వాసవీ కన్యకా పరమేశ్వరి మాత జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ధరణినాథ శర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారి మూలమూర్తికి, ఉత్సవ మూర్తికి అభిషేకం చేశారు. ఉత్సవమూర్తిని ఊయలలో పడుకోబెట్టి, ఆర్యవైశ్యుల గోత్రాల అనుసారంగా అమ్మవారికి నామకరణ ఉత్సవం చేపట్టారు.

కల్యాణలక్ష్మిని లక్షా 50వేలకు పెంచాలి

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఆడపిల్లల తల్లిదండ్రుల్లో మనోధైర్యం నింపేందుకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వం దానిని రూ. లక్షా 50వేలకు పెంచాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రం జగదేవ్‌పూర్‌లోని రైతువేదికలో బుధవారం డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డితో కలిసి లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యాదవరెడ్డి మాట్లాడుతూ.. దివంగత వైఎస్ఆర్ పేదల సంక్షేమమే ధ్యేయంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను ప్రవేశపెట్టగా, మాజీ సీఎం కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు వంటి పథకాలను చేపట్టి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, తహసీల్దార్ నిర్మల, డీటీ రఘువీరారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇళ్లు

నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి



పంటలను పరిశీలిస్తున్న శ్రీనివాస్ రెడ్డి

దుబ్బాకటౌన్: నియోజకవర్గానికి బీఆర్ఎస్ చేసిందేమి లేదని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవినీతికి తావే లేదని దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి మతిభ్రమించిందని అందుకే కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవినీతి జరుగుతుందని ఆరోపించడం సిగ్గుచేటన్నారు. గతంలో అనర్హులకు డబుల్ బెడ్‌రూంలు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో 3500 మంది లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే సొంత గ్రామం పోతారం, ఎంపీ రఘునందన్ రావు సొంత గ్రామం బొప్పపూర్‌లో ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొంగరి రవి, నాయకులు శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, సాయితేజ గౌడ్, తదితరులున్నారు.

నష్టపరిహారం అందిస్తాం

దుబ్బాకటౌన్: అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులకు వీలైనంత త్వరగా నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాయపోల్ మండలం రామరం గ్రామంలో వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలకు దెబ్బతినడం బాధకరమన్నారు. రైతులెవరు అధైర్యపడొద్దని నష్ట పరిహారం వివరాలు సేకరించి పరిహారం అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుధాకర్, మల్లేశం, కిష్టారెడ్డి, తదితరులున్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోండి

బీఆర్ఎస్ నాయకుడు మల్లికార్జున్



ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లికార్జున్ కోరారు. బుధవారం మండలంలోని గౌరవెల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో నాలుగు సార్లు అకాల వర్షం పడి వడ్లు, పండ్ల తోటల రైతులు నష్టపోయారని వారిని ఆదుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది కాని.. ఇప్పటివరకు ఆదుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. అలాగే, ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. తరుగు పేరిట బస్తాకు అరకిలో ఎక్కువ తీసుకుంటున్నారని ఆరోపించారు. వెంటనే నిలివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుశురాములు, అరవింద్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల సేవలు అభినందనీయం



ప్రమాణస్వీకారంలో పాల్గొన్న యాదవరెడ్డి, నర్సారెడ్డి

గజ్వేల్‌రూరల్: సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు చేపడుతున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. బుధవారం గజ్వేల్‌లో ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడిగా శేఖర్ గుప్తా, పట్టణ అధ్యక్షుడిగా అత్తెల్లి శ్రీనివాస్, యువత అధ్యక్షుడిగా గౌరీశంకర్‌లతో పాటు కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్యవైశ్యులు నమ్మిన సిద్ధాంతం, కృషి, పట్టుదలతో ఎవరిపై ఆధారపడకుండా తమ కష్టాన్ని నమ్ముకుంటూ సమాజంలో ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. ముమ్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్‌లు ఎన్‌సీ రాజమౌళి భాస్కర్, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

కొత్తవారు వస్తే సమాచారమివ్వండి



కూలీలకు అవగాహన కల్పిస్తున్న షీటీం బృందం

హుస్నాబాద్‌రూరల్: పల్లెలకు కొత్త వ్యక్తులు వస్తే సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. రెట్టింపు డబ్బులు ఆశలు చూపి మోసం చేసే వ్యక్తుల గురించి షీటీమ్ బృందం మహిళలకు అవగాహన కల్పించింది. గురువారం గాంధీనగర్‌లో ఉపాధిహామీ పనుల దగ్గర మహిళా కూలీలకు చట్టాలు, సైబర్ నేరాల గురించి వివరించారు. మహిళలపై దాడులు జరిగితే మౌనం వీడి పోలీసులకు సమాచారం ఇస్తే దోషులను శిక్షించి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. గ్రామాల్లో తాళం వేసిన ఇళ్లలో చోరీలు జరుగుతున్నాయని, వేసవి కాలంలో ఇంటికి తాళలు వేసి డాబాలపై నిద్రించే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ పనులకు వెళ్లే మహిళలు నగలు ధరించి ఒంటరిగా వెళ్లొద్దన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై సంపత్‌రెడ్డి, షీటీం బృందం సదయ్య, ప్రశాంతి పాల్గొన్నారు.

హనుమాన్ దీక్షాదారులకు భిక్ష

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలోని రంగనాయక సాగర్ వద్ద అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వంగ రాజేశ్వర్ రెడ్డి సహకారంతో బుధవారం హనుమాన్ దీక్షాదారులకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హనుమాన్ దీక్షాదారులతో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి దయతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

బెజ్జంకి(సిద్దిపేట): తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనిత పేర్కొన్నారు. మండలంలోని గాగిల్లాపూర్‌లో తాగునీటి పైప్‌లైన్‌లను బుధవారం పరిశీలించారు. నీటి సరఫరా పైప్‌ల్లో అంతరాయం ఏర్పడిన చోట మరమ్మతులు చేయించి, అవసరమైన చోట కొత్త పైపులు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బెజ్జంకి ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే రాజీవ్ యువ వికాసం పథకం



మాట్లాడుతున్న ఎంపీడీఓ

దుబ్బాకరూరల్: మండల ప్రజాపరిషత్తు కార్యాలయంలో రాజీవ్‌యువ వికాసం పథకంపై బ్యాంక్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ భాస్కరశర్మ మాట్లాడుతూ.. రాజీవ్ యువవికాసం పథకాన్ని అర్హులకు వర్తించేలా చేస్తామన్నారు. మండలంలోని పలు రకాల యూనిట్లకు 2307 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వం నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధికి రాయితీపై రుణం అందించేందుకు ఈ పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ నరేందర్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖ అధికారులు, బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా భట్రాజుల సంఘం ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్, బుల్లితెరలో రాణించిన విద్యార్థులకు, నటులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించారు. సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ.. పరీక్షల్లో రాణించిన విద్యార్థులను సన్మానించడం, వారిని ప్రోత్సహించడం తమ బాధ్యత అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అశోక్‌రాజు, ప్రధాన కార్యదర్శి రామరాజు, కోశాధికారి దయానంద రాజు, రాజేంద్రప్రసాద్, సాయికృష్ణ, రమణ, కరుణ శ్రీ, రవిరాజు, కృష్ణ పాల్గొన్నారు.

ఎల్లమ్మతల్లి దయతో సుభిక్షంగా ఉండాలి

మాజీ మంత్రి హరీశ్‌రావు



ఎల్లమ్మ పట్నాల వద్ద పూజలు చేస్తున్న హరీశ్‌రావు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఎల్లమ్మ తల్లి దయతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆకాంక్షించారు. మండలంలోని మాచాపూర్‌లో నిర్వహిస్తున్న ఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవాల్లో బుధవారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి దయతో మన దేశ సైనికులు పాకిస్తాన్‌తో వీరోచితంగా పోరాడి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఒకప్పుడు మాచాపూర్‌లో చెరువు నిండాలంటే కప్పతల్లి ఆట, దేవాలయాల్లో అభిషేకాలు చేసేవారని గుర్తు చేశారు. రంగనాయక సాగర్ నిర్మాణంతో వేసవిలో సైతం చెరువులు నిండుకుండలా మారాయన్నారు. రెండు పంటలు పండించుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ సన్నిధిలో హరీశ్‌రావు

సిద్దిపేటఅర్బన్: మండలంలోని బక్రిచెప్యాల గ్రామంలో జరుగుతున్న ఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవంలో మాజీ మంత్రి హరీశ్‌రావు పాల్గొనా ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్నారు. గౌడ సంఘం సభ్యులు, మహిళలు, గ్రామస్తులు హరీష్‌రావుకు స్వాగతం పలికారు. ఎల్లమ్మతల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు.

ప్రభుత్వానికి జ్ఞానోదయం కలగాలి

సిద్దిపేటరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన ఏడాది కాలంలో ప్రజలను ప్రభుత్వం ఆగమాగం చేస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని రాంపూర్‌లో రేణుక ఎల్లమ్మ తల్లి ఉత్సవం, నారాయణరావుపేట మండలంలోని గుర్రాలగొందిలో అభయాంజనేయ స్వామి అన్నదాన భవనం ప్రారంభోత్సవాల్లో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో మంచినీళ్లు, సకాలంలో రైతుబంధు, పెన్షన్‌లు, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్టు వంటి ఎన్నో పథకాలు అందించడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు.